సాక్షి
ఆదిలాబాద్

బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



గల్లీ నుంచి 'ఢిల్లీ'దాకా..

దశాబ్దాలుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రాజకీయకేంద్రంగా నిర్మల్ కొనసాగింది. ఇక్కడి ప్రజా ప్రతినిధులే ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్, ఢిల్లీ దాకా చక్రం తిప్పిన సందర్భాలున్నాయి. 8లో▸

డీఎల్ఎస్ఏ కార్యదర్శి బదిలీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే బదిలీ అయ్యారు. ఇందుకు సంబంధించి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్, అసిస్టెంట్ సెషన్ జడ్జి హన్మకొండకు బదిలీ అయ్యారు. ఈమె స్థానంలో హైదరాబాద్‌లోని నాంపెల్లి క్రిమినల్ కోర్టులో ఫోర్త్ అడిషనల్ చీఫ్ మెట్రపాల్టనిగా పనిచేస్తున్న బోనగిరి సౌజన్య జిల్లాకు బదిలీపై రానున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0/27.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఆదిలాబాద్‌లో త్వరలో కేసీఆర్ బహిరంగ సభ

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా త్వరలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఆదిలాబాద్‌లో ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం చేపట్టాల్సిన పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా మాజీ సీఎం కేసీఆర్ ప్రచారం నిర్వహిస్తారన్నారు. త్వరలో చేపట్టే బస్సు యాత్రలో భాగంగా కాగజ్‌నగర్, ఆదిలాబాద్‌లో బహిరంగ సభలు ఉంటాయని తెలిపారు. కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మనోహర్, ఆదిలాబాద్ ఎంపీపీ గంద్రత్ రమేశ్, జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ కనబర్చాలి

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లినిక్‌కు మంగళవారం పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది, వైద్యసేవలు పొందిన మహిళలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వివిధ రుగ్మతలతో బాధపడే మహిళలకు చికిత్స అందించాలని సూచించారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, ఇతర సేవల కోసం రిమ్స్‌కు తరలించాలన్నారు. ఆయన వెంట ఆరోగ్య మహిళా మెడికల్ ఆఫీసర్ శ్రావ్యవాణి, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులకు సిమ్‌కార్డులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు, సీఆర్పీలకు విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి నారాయణ సిమ్‌కార్డులను అందజేశారు. డీఈవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 541 పాఠశాలలకు సంబంధించి 565 సిమ్ కార్డులను అందించినట్లు పేర్కొన్నారు. ఇదివరకే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించి ట్యాబ్‌లను అందించామని తెలిపారు. ఈ ట్యాబ్‌లకు సంబంధించి బిల్లులను రెండేళ్లపాటు ప్రభుత్వం భరిస్తుందన్నారు. డిజిటల్ ఎడ్యుకేషన్, విద్యార్థుల రిపోర్టు, తదితర వాటికి ట్యాబ్‌లు దోహదపడతాయని తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

ఎదులాపురం: డిమాండ్స్ డే పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగులు, కార్మికులకు రావాల్సిన ఎరియర్స్, తదితర బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందులో ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆశన్న, నాయకులు భీంరావు, పొచ్చన్న, స్వామి, రామస్వామి, మాధవ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా బంగారుగూడ డంప్ యార్డులోని పారిశుధ్య వనరుల ఉద్యానవనం



ఎఫ్ఎస్టీపీ.. ఉత్తదేనా!

- మానవ వ్యర్థాలతో ఎరువుల తయారీకి బ్రేక్
- అలంకారప్రాయంగా మారిన ప్లాంట్
- రూ.2.56 కోట్ల నిధులు వృథా
- బల్దియాకు అదనపు భారంగా విద్యుత్ బిల్లు



ఎరువు తయారు చేసే యంత్రం

కైలాస్‌నగర్: మానవ విసర్జిత వ్యర్థాలను శుద్ధి చేసి ఎరువుగా ఉపయోగించాలనే ఉద్దేశంతో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్టీపీ) నిరుపయోగంగా మారింది. నిర్వహణ బాధ్యతలు పొందిన కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడం, పర్యవేక్షించాల్సిన బల్దియా అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ కేంద్రం అలంకారప్రాయంగా మారింది.ఫలితంగా రూ.2.56కోట్ల ప్రజాధనం వృథాగా మారినట్లయింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్‌లైన్‌తో రూ.లక్షల్లో వస్తున్న బిల్లు బల్దియాకు అదనపు భారంగా మారుతోంది.

సేంద్రియ ఎరువు తయారీ లక్ష్యంగా..

ఆదిలాబాద్ పట్టణంలోని ఇళ్లల్లో సేకరించిన మానవ వ్యర్థాల(మలం)ను సెప్టిక్ ట్యాంకర్ల నిర్వాహకులు తీసుకెళ్లి ఊరి బయట పడేస్తున్నారు. దీంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. వర్షాలు కురిసిన సమయంలో నీటి వనరులు కలుషితం కావడంతో పాటు పర్యావరణానికి హానీ కలుగుతుంది. ఈ పరిస్థితులను దూరం చేయడంతో పాటు మలంతో సేంద్రియ ఎరువు తయారు చేసి పొలాలు, మొక్కల పెంపకానికి సరఫరా చేస్తే అదనపు ఆదాయం గడించాలనే ఉద్దేశంతో పట్టణంలోని బంగారుగూడ డంపింగ్‌యార్డులో మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్లాంట్ కింద 90వేల లీటర్ల వ్యర్థాలను నిల్వచేసే సామర్థ్యంతో కూడిన ట్యాంక్‌ను నిర్మించారు. మలాన్ని, నీటిని వేరు చేసేందుకు ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేశారు. వ్యర్థాలను అందులో శుద్ధి చేసి నీటిని మొక్కలకు వినియోగిస్తారు. మలాన్ని ప్రత్యేక షెడ్డులో15 రోజుల పాటు ఎండబెడుతారు. ఇందుకోసం సోలార్ విద్యుత్ సౌకర్యం కూడా కల్పించారు. పూర్తిగా ఎండిన తరువాత పొడి చేసి పంట చేలకు ఎరువుగా తరలిస్తారు. ఇందులో రోజుకు 30వేల లీటర్లను ప్రాసెసింగ్ చేసే సామర్థ్యంతో కూడిన యంత్రాలను ఏర్పాటు చేశారు. రూ.2.56 కోట్ల వ్యయంతో ఈ ప్లాంట్‌ను 2021 ఆగస్టు 17న అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న ప్రారంభించారు. అయితే 2022 డిసెంబర్ 18 వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో తయారీ మొదలు కాలేదు. సుమారు 16 నెలల పాటు కేంద్రం అలంకారప్రాయంగా మారింది. ఎట్టకేలకు ప్రత్యేకంగా హైటెన్షన్ లైన్ (హెచ్‌టీ) ఏర్పాటు చేశారు.

గత డిసెంబర్ నుంచి షురూ..

ఈ కేంద్రం నిర్వహణ బాధ్యతలను బీఓటీ పద్ధతిన ప్రైవేట్ వ్యక్తికి అప్పగించారు. గతేడాది డిసెంబర్‌లో విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో సేంద్రియ ఎరువుల ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభించారు. రోజుకు రెండు క్వింటాళ్ల ఎరువు ఉత్పత్తి చేసి 25 కిలోలకు ఒక బ్యాగ్ చొప్పున ప్యాకింగ్ చేయాలనే ఉద్దేశంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. అయితే అది కొద్ది రోజులకే పరిమితమైంది. కేంద్రం నిర్వహణ లాభసాటిగా లేదనుకున్నారో లేక ఇతర కారణాలేంటో తెలియదు కానీ గుత్తేదారు కేంద్రానికి తాళం వేయడంతో అలంకారప్రాయంగా మారింది. కేంద్రం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు కేవలం వారం కూడా ఎరువు ఉత్పత్తి కాకపోవడం గమనార్హం. మరోవైపు ప్లాంట్ కోసం ప్రత్యేకంగా హైటెన్షన్ లైన్ ఏర్పాటుతో నెలకు విద్యుత్ బిల్లు రూ.లక్షకుపైగానే వస్తోంది. ఇది బల్దియాకు అదనపు భారంగా మారుతుందే తప్ప కేంద్రం ద్వారా ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదనే విమర్శలున్నాయి.

త్వరలోనే అందుబాటులోకి..



పట్టణంలో సెప్టిక్ ట్యాంకుల క్లీనర్లు ఐదుగురు మాత్రమే ఉన్నారు. దీంతో కేంద్రానికి సరిపడా మలం రావడం లేదని సిబ్బంది చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరలోనే ఎఫ్ఎస్టీపీ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతాం.

– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

జిల్లా కేంద్రంలో నిర్వహించిన శోభాయాత్రలో యువకుల నృత్యాలు



జైహనుమాన్



రాంనగర్ ఆలయంలో భక్తుల పూజలు



శోభాయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కైలాస్‌నగర్: హనుమాన్ జయంతి వేడుకలను జిల్లావాసులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఆంజనేయ ఆలయాలకు చేరుకున్న భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. హనుమాన్ నామ స్మరణ మారుమోగింది. జిల్లా కేంద్రంలోని రాంనగర్, తిర్పెల్లి, వడ్డెరకాలనీ, భాగ్యనగర్, ఇంద్రానగర్ కాలనీల్లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రాత్రి నిర్వహించిన శోభాయాత్రను శ్రీరామచంద్ర గోపాలకృష్ణమఠం వద్ద ఎమ్మెల్యే పాయల్ శంకర్, మఠాధిపతి యోగానంద సరస్వతి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం డప్పు చప్పుళ్ల కోలాటాల నడుమ శోభాయాత్ర ప్రధాన వీధుల్లో నేత్రపర్వంగా సాగింది.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆదరించి ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో మంగళవారం విస్తృత ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ఆరు గ్యారంటీ హామీ పత్రాలను పంచుతూ స్టిక్కర్లు అందజేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, వార్డు కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్, లోక ప్రవీణ్‌రెడ్డి, డి.శ్రీలేఖ, రషీద్ ఉల్‌హక్, ఎంఏ షకీల్, రఫీక్ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి సుగుణ

ఇంద్రవెల్లి: ప్రజా సమస్యలకు పరిష్కారం దొరకాలంటే ప్రశ్నించే గొంతుకను పార్లమెంట్‌కు పంపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు.

25 నుంచి ఓటర్ స్లిప్పుల పంపిణీ

- జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా

కైలాస్‌నగర్: ఈనెల 25 నుంచి ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా అన్నారు. సంబంధిత అధికారులతో మంగళవారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ఓటర్ స్లిప్పులు పంచడంతో పాటు ఓటర్ గైడ్‌ను కూడా అందించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో, మున్సిపాలిటీలో బూత్‌స్థాయి అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా సెక్టోరియల్ అధికారులను నియమించామన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. వృద్ధులు, దివ్యాంగ ఓటర్ల సదుపాయం నిమిత్తం వీల్‌చైర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నిక సామగ్రిని చేరవేసేందుకు వీలుగా వాహనాలు సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎంపీడీవోలు తదితరులున్నారు.

అనుమతి లేకుండా ప్రచారం చేస్తే కఠిన చర్యలు

రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఎంసీఎంసీ ద్వారా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతి లేకుండా ప్రచారం చేస్తే ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తప్పవని తెలిపారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ప్రచారాలకు అనుమతులు పొందాలని పేర్కొన్నారు. అభ్యర్థుల ఖర్చులు లెక్కించడం జరుగుతుందని, అనుమతి తీసుకోకుండా ప్రసారం చేస్తే అభ్యర్థిపై ప్రకారం ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఆరో రోజు ఆరు నామినేషన్లు

- నామినేషన్ వేసిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సక్కు



ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఆత్రం సక్కు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఆరో రోజైన మంగళవారం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు తన తొలిసెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, జాదవ్ అనిల్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, మైనార్టీ నాయకుడు యూనిస్ అక్బానీతో కలిసి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు తన నామినేషన్ పత్రాలు అందజేశారు. అలాగే సక్కు తరఫున ఎమ్మెల్సీ దండే విఠల్, నాయకులు జాన్సన్ నాయక్, శ్యాంసుందర్, రాంకిషన్‌రెడ్డి, సరస్వతి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇండియా ప్రజా బంధు పార్టీ తరఫున పట్టణంలోని టీచర్స్‌కాలనీకి చెందిన గేడం సాగర్ రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా మేస్రం గంగాదేవి రెండోసెట్, స్వతంత్ర అభ్యర్థిగా ఉట్నూర్ మండల కేంద్రంలోని బోయవాడకు చెందిన చవాన్ రాము నామినేషన్ దాఖలు వేశారు. తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి కలెక్టరేట్‌లోని ఆర్వో కార్యాలయంలో కలిసి అందజేశారు. దీంతో ఇప్పటి వరకు అందిన నామినేషన్ల సంఖ్య 12కు చేరింది.

ఆదరించి గెలిపించాలి.. : ఆత్రం సక్కు

ఆదివాసీ బిడ్డనైన తనను ఆదరించి ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. మంగళవారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన తనకు అవకాశం కల్పించి ఆదరించాలని కోరారు.

ఇక ఆటాపాటే..

- నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు
- ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు అందజేత
- చివరి రోజు విద్యార్థుల కేరింతలు
- 49 రోజుల పాటు ఎంజాయ్‌కు సన్నద్ధం



కప్పర్లలో ప్రోగ్రెస్ కార్డులతో విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: వేసవి సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పడ్డ విద్యార్థులు ఇక చదువులకు టాటా చెప్పి ఆటా పాటల్లో నిమగ్నం కానున్నారు. ఏడాది పాటు తరగతులు, హోంవర్కులు, ట్యూషన్లు, పరీక్షలతో సతమతమైన విద్యార్థులు ఇక ఆహ్లాదాన్ని పొందనున్నారు. మంగళవారం ఈ విద్యా సంవత్సరం చివరిరోజు కావడంతో పాఠశాలలకు చేరుకున్నారు. ఉపాధ్యాయులు వార్షిక పరీక్షల ఫలితాలను ప్రకటించి విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. వారి తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. విద్యార్థుల ప్రగతి పై చర్చించారు. అనంతరం కేరింతలు కొడుతూ చిన్నారులు ఇంటిబాట పట్టారు.

49 రోజుల పాటు సెలవులు..

నేటి నుంచి జూన్ 11వరకు వేసవి సెలవులు ఉంటాయని డీఈవో ప్రణీత తెలిపారు. ఈసెలవుల్లో పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులకు ఎస్–1, ఎస్–2, ఎస్–3, ఎస్–4, ఎఫ్–1, ఎఫ్–2 ఫలితాలకు సంబంధించి ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసి ప్రోగ్రెస్ కార్డులు అందించినట్లు పేర్కొన్నారు.వచ్చే విద్యా సంవత్సరంలో పిల్లల్ని సర్కారు బడుల్లో చేర్పించాలని కోరారు. నాణ్యమైన విద్యాబోధన, ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంటిబాట పట్టిన విద్యార్థులు

పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో జిల్లాలోని ఆయా గురుకులాలు, వసతిగృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు వచ్చి వారిని తీసుకెళ్లారు. బస్టాండ్ ప్రాంతం కిక్కిరిసిపోయింది.

కోచింగ్ సెంటర్ల వైపు పరుగులు..

ఈ వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏదైన కోర్సు నేర్పించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇందులో భాగంగా కంప్యూటర్ శిక్షణ, స్విమ్మింగ్, క్రికెట్, భరతనాట్యం, కూచిపుడి, తదితర అంశాల్లో శిక్షణ కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి సిలబస్‌ను వేసవి సెలవుల్లో బోధించేందుకు కొన్ని చోట్ల ట్యూషన్ సెంటర్లు వెలిశాయి. మరి కొంతమంది చిన్నారులు కాలక్షేపం కోసం అమ్మమ్మ, నానమ్మ ఊళ్లతో పాటు సొంతూర్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

'కోడ్' ఉల్లంఘించిన సీఎంపై ఫిర్యాదు చేస్తాం

- రేవంత్ మదిలో బీజేపీ.. బయట కాంగ్రెస్
- ఆదివాసీలకు క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలను భయపెట్టి ఓట్లు దండుకునే విధంగా ప్రయత్నించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే ఇచ్చిన హామీలు నెరవేర్చుతామని, లేకపోతే అమలు కావని ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేలా సీఎం బహిరంగ సభలో మాట్లాడారని తెలిపారు. ప్రలోభాలకు గురిచేసి ఎన్నికల్లో గెలవాలని యత్నిస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి ఖాయమన్నారు. సీఎం రేవంత్‌ది రెండు కళ్లు, రెండు నాలుకల ధోరణి అన్నారు. ఆయన మదిలో బీజేపీ ఉందని.. బయట మాత్రం కాంగ్రెస్ కనిపిస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీల మధ్య అంతర్గత ఒప్పందం ఉందన్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశం తమకు లేదని, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులే పడగొడతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును దొరని అవమానించారని, ఆదివాసీలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిది రెడ్డి అహంకారమని, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సక్కు భారీ మెజార్టీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు విజ్జగిరి నారాయణ, సాజిదొద్దీన్, యూనుస్ అక్బానీ, నర్సింగ్‌రావు, రాజు, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి నామినేషన్‌కు కేంద్ర విదేశాంగ మంత్రి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్ నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర విదేశాంగ మంత్రి శివశంకర్, ఓబీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ బుధవారం ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఏర్పాట్లను ఎంపీ అభ్యర్థి నగేశ్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నామినేషన్‌లో భాగంగా ఉదయం 10 గంటలకు రాంలీలా మైదానం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు పేర్కొన్నారు. భారీగా తరలిరావాలని కోరారు. వారి వెంట మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్, నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్‌లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తూ ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఆగిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, పార్టీ నాయకురాలు మర్సుకోల సరస్వతిని మంగళవారం స్థానిక నాయకులు, కార్యకర్తలు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, బాబాశ్యాం తదితరులున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో ఎస్సై

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్‌లో వేర్వేరు చోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 55 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. కడమంచి లక్ష్మణ్, పాతం పోశెట్టి, గడ్డం ప్రభాకర్, కడమంచి గంగాధర్ నివాసాల్లో నిల్వ ఉంచిన 110 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ మేరకు బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

జొన్న లేప తిని ఎనిమిది పశువులు మృతి

తాంసి: మండలంలోని అట్నంగూడ గ్రామ శివారులో జొన్న లేప తిని ఎనిమిది పశువులు మృతిచెందగా మరికొన్ని అస్వస్థతకు గురయ్యాయి. గ్రామానికి చెందిన పశువులు మంగళవారం మేతకు వెళ్లి పంటచేనులో జొన్న లేప తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. బాధిత రైతులు స్వామి, తుకారాం, మహేశ్ వెంటనే పశువైద్య అధికారులకు సమాచారం ఇచ్చారు. పశువైద్యాధికారి శ్రీకాంత్, సిబ్బంది సతీశ్, ప్రవీణ్‌తో కలిసి అస్వస్థతకు గురైన పశువులకు వైద్యం అందించారు. అయినప్పటికీ ఎనిమిది పశువులు మృతి చెందగా ప్రభుత్వం పరిహారంతో ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఎడ్లు మృతి



మృతి చెందిన ఎద్దు

ఉట్నూర్‌రూరల్: సోమవారం రాత్రి వర్షం కురుస్తున్న సమయంలో మండలంలోని సాలెవాడ (బీ) గ్రామంలో రైతు మెస్రం మెంగుకు చెందిన రెండు ఎడ్లు ప్రమాదవశాత్తు విద్యుత్‌తీగలు తగిలి షాక్‌తో మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.1.20లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

గల్లీ నుంచి 'ఢిల్లీ' దాకా..

- ఎంపీలుగా.. కేంద్ర మంత్రులుగా ఎన్నిక
- జాతీయ స్థాయికి ఎదిగిన నిర్మల్ నేతలు
- రిజర్వేషన్‌కు ముందు.. రాజకీయ కేంద్రం
- ఒకప్పుడు చక్రం తిప్పిన నాయకులు
- ఈసారి ఎన్నికల్లో స్తబ్ధుగా ఉన్న లీడర్లు



వేణుగోపాలాచారి, కేంద్ర మాజీమంత్రి



అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎంపీ



పొద్దుటూరి నర్సారెడ్డి, మాజీ ఎంపీ



పొద్దుటూరి గంగారెడ్డి, మాజీ ఎంపీ



సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

నిర్మల్: దశాబ్దాలుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రాజకీయకేంద్రంగా నిర్మల్ కొనసాగింది. ఏళ్లపాటు ఉమ్మడిజిల్లాను శాసించింది. ఇక్కడి ప్రజాప్రతినిధులే ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్, ఢిల్లీ దాకా చక్రం తిప్పిన సందర్భాలున్నాయి. గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఎదిగిన నేతలున్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో మంత్రి పదవులు చేపట్టి జాతీయ స్థాయిలో నిర్మల్ పేరు నిలిపారు. ఎంతోమందిని లీడర్లుగా తీర్చిదిద్దారు. వారు ఇప్పుడు స్తబ్ధుగా ఉంటున్నారు. పార్లమెంట్‌పోరులో సైలెంటుగా మారిపోయారు.

ఒకప్పుడు నిర్మల్‌దే హవా..

ప్రస్తుతం నిర్మల్ నుంచి బీజేఎల్పీ లీడర్‌గా మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు. ఒకప్పుడైతే పలువురు హైదరాబాద్, ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పారు. 2009 పార్లమెంట్ ఎన్నికల వరకూ నిర్మల్ నేతలదే హవా కొనసాగింది. ఎస్టీ రిజర్వ్‌డ్‌గా ఎంపీ స్థానం మారిన నుంచి ఈ ప్రాంత ప్రభావం తగ్గుతూ వచ్చింది. ఎస్టీ జనాభా ఎక్కువగా ఉండే ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ప్రాంతాల ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుత ఎన్నికల్లోనూ మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ప్రాంతాలకు చెందినవారే.

పొద్దుటూరి బ్రదర్స్..

సారంగపూర్ మండలం మలన్న చించోలి గ్రామానికి చెందిన పొద్దుటూరి నర్సారెడ్డి, పొద్దుటూరి గంగారెడ్డి రాష్ట్ర, జాతీయస్థాయి రాజకీయాల్లో రాణించారు. పెద్ద పదవులు చేపట్టి ఆదర్శ నేతలుగా నిలిచారు. వరుసకు వీరు అన్నదమ్ములు. పొద్దుటూరి గంగారెడ్డి 1967, 1971లో రెండుసార్లు ఎంపీగా గెలుపొందారు. 1978లో కాంగ్రెస్ రెడ్డి, ఇందిరా కాంగ్రెస్‌లుగా విడిపోయింది. అప్పటి అసెంబ్లీ ఎన్నికల్లో రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీచేసిన పొద్దుటూరి నర్సారెడ్డి, వరుసకు సోదరుడైన ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి గంగారెడ్డి చేతిలో ఓడిపోయారు. అలా గంగారెడ్డి రెండుసార్లు ఎంపీ, ఒకసారి ఎమ్మెల్యే అయ్యారు. ఇక నర్సారెడ్డి నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించారు. 1962–67, 1967–72లలో వరుసగా రెండుపర్యాయాలు విజయాలు అందుకున్నారు. ఇక మూడోసారి 1972–77లో పోటీ లేకుండా ఏకగ్రీవంగా గెలుపొందడం విశేషం. ఎమ్మెల్యే పదవిలో ఉంటూ 1964లో పీసీసీ చీఫ్‌గా వ్యవహరించారు. రాష్ట్ర భారీ నీటిపారుదల, రెవెన్యూ శాఖల మంత్రిగా పనిచేశారు. ఢిల్లీ బాట లో భాగంగా 1989లో నర్సారెడ్డి ఆదిలాబాద్ ఎంపీగానూ పోటీ చేసి గెలిచారు. ఇటీవలే ఆయన మరణించారు. ప్రజల్లో గంగన్నబాపు, నర్సన్నబాపుగా పేరొందిన వీరిద్దరూ తమ వారసులను రాజకీయాల్లోకి దింపకపోవడం గమనార్హం.

'చారి' శకం..

సముద్రాల వేణుగోపాలాచారి.. ఉమ్మడి జిల్లాలో కొన్నేళ్లపాటు ఎదురులేని నేత. దశాబ్దాలపాటు ఉమ్మడి జిల్లా రాజకీయాలను శాసించారు. నిర్మల్ గల్లీల్లో డాక్టర్‌గా సేవలందించి ఏకంగా కేంద్రమంత్రి దాకా ఎదిగారు. 1985 నుంచి వరుసగా.. 1989, 1994లో నిర్మల్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా హ్యాట్రిక్ విజయాలు సాధించారు. 1996లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, ఎంపీగా వెళ్లారు. అలా.. 1996, 1998, 1999 వరుస పార్లమెంట్ ఎన్నికల్లోనూ గెలిచి ఎమ్మెల్యే, ఎంపీగా డబుల్ హ్యా ట్రిక్ సాధించిన నేతగా నిలిచారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టీ డీపీ తరఫున కేంద్ర విద్యుత్, వ్యవసాయశాఖ సహా య మంత్రిగా పనిచేశారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన 2014 నుంచి 2022 వరకు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా పనిచేశారు. 2023లో రాష్ట్ర ఐడీసీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ప్రస్తుతం సైలెంట్..

జిల్లా నుంచి ఢిల్లీదాకా ఎదిగిన నేతల్లో ప్రస్తుతం అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, వేణుగోపాలాచారి వీరిద్దరే క్రియాశీలకంగా ఉన్నారు. ఇందులో వేణుగోపాలాచారి పదేళ్లుగా ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో మాజీగా మారారు. ప్రస్తుతం అటు కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా, ఇటు బీఆర్‌ఎస్‌లో వెళ్లలేని పరిస్థితులు ఉండటంతో ఆయన సైలెంట్‌గా మారిపోయారు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరినప్పటికీ వేణుగోపాలాచారి కూడా జిల్లాలో ఎక్కడా ప్రచారం చేపట్టడం లేదు.

'అల్లోల' రాజకీయం..

నిర్మల్ నుంచే చక్రం తిప్పిన మరో కీలకనేత అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి. టీడీపీ నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టి.. అదే పార్టీని ఓడించి జిల్లాలో కనుమరుగు చేశారు. జెడ్పీచైర్మన్‌గా ఉండి 1991లోనే టీడీపీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా గెలిచారు. అప్పట్లో పార్టీ నిబంధనలకు విరుద్ధంగా మైనార్టీలో ఉన్న పీవీ నర్సింహారావు ప్రభుత్వానికి మద్దతు ప్రకటించి సంచలనంగా నిలిచారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి 1999, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా, 2008లో ఎంపీగా మరోసారి గెలిచారు. 2014 (బీఎస్పీ), 2018 (బీఆర్‌ఎస్)లో ఎమ్మెల్యేగా గెలిచి పదేళ్ల అటవీ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రిగా పని చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



నిర్మల్ టౌన్: వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ



భైంసా టౌన్: వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ, సీఐ, ఎస్సై

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 22న పట్టణంలోని కురన్నపేట్ మున్నూరుకాపు సంఘం వద్ద ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. ఈ క్రమంలో తోకల రాజేశ్వర్ ప్లాస్టిక్ కవర్‌లో 245 గ్రాముల విడి గంజాయి విక్రయించేందుకు తీసుకువెళ్తూ పట్టుబడ్డాడు. రాజేశ్వర్‌ను విచారించగా తాను షేక్ సోహెల్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి ఇతరులకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకొన్నాడు. గంజాయి స్వాధీనం చేసుకుని షేక్ అమీర్ సోహెల్ కోసం గాలిస్తుండగా.. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద పోలీసులకు చిక్కాడు. సోహెల్ నుంచి 139 గ్రాముల గంజాయి, రూ.4,140 నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ అనిల్‌కుమార్, ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ ఉన్నారు.

భైంసాలో మరో ఇద్దరు..

భైంసాటౌన్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. పట్టణంలోని ఖాజీగల్లికి చెందిన ముజాహిద్‌ఖాన్, రాహుల్‌నగర్‌కు చెందిన షేక్ మక్బూల్ సోమవారం రాత్రి బస్టాండ్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై షరీఫ్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. వీరిని చూసి పారిపోతున్న అనుమానితులను వెంబడించి పట్టుకున్నారు. వారి నుంచి 1142 గ్రాముల పొడి గంజాయి స్వాధీనం చేసుకుని విచారించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన షరీఫ్ నుంచి 10రోజుల కిందట 2కిలోల పొడి గంజాయి తెచ్చినట్లు వారు తెలిపారు. పట్టణానికి చెందిన మహ్మద్‌బారికి 250 గ్రాములు, తురాబ్‌ఖాన్‌కు 200 గ్రాములు, రాహిల్‌కు 100 గ్రాములు విక్రయించినట్లు పేర్కొన్నారు. నాందేడ్‌కు చెందిన షరీఫ్‌తో పాటు స్థానికంగా గంజాయి కొనుగోలు చేసిన ముగ్గురిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. సీఐ రాజారెడ్డి, ఎస్సై షరీఫ్ ఉన్నారు.

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట పెట్రోల్ బంక్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి అనుమానాస్పదంగా పారిపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. అతడి బ్యాగు తనిఖీ చేయగా 300 గ్రాముల గంజాయి దొరికింది. విచారణలో అతడిని జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేటకు చెందిన ముక్తార్‌గా పోలీసులు గుర్తించారు. గంజాయి స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు. నార్కోటిక్స్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరికి గాయాలు

నర్సాపూర్(జీ): నసీరాబాద్ గ్రామం వద్ద 61వ జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని బైక్‌తో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం మండలం వట్టోలి గ్రామానికి చెందిన శివరాత్రి ఎగ్గాం చిన్నసాయన్న అతని భార్య రాధతో కలిసి మంగళవారం బైక్‌పై సారంగపూర్ మండలం బోరిగాం గ్రా మానికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా న ర్సాపూర్ (జీ) మండలం నసీరాబాద్ గ్రామం వద్ద 61వ జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో చిన్నసాయన్న, రాధ కు గాయాలయ్యాయి. స్థానికులు 108లో చికిత్స నిమిత్తం నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి కారు బోల్తా

కడెం: ధర్మాజీపేట్ గ్రామంలో మంగళవారం ఉదయం అతి వేగంతో కారు అదుపుతప్పి బోల్తా పడింది. కడెం నుంచి ఖానాపూర్ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి మెయిన్ రోడ్డు పక్కన చికెన్ సెంటర్, పక్కనున్న టేలాలోకి దూసుకెళ్లింది. ఈక్రమంలో కారు బోల్తా పడగా అందులోని డ్రైవర్ నలిమెల అనిల్, మరో వ్యక్తి శివానంద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

మొసలి పట్టివేత



పట్టుకున్న మొసలితో అధికారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ కాలనీలోగల నర్సయ్య వ్యవసాయ బావిలో మంగళవారం ఫారెస్ట్ అధికారులు మొసలిని పట్టుకున్నారు. తన వ్యవసాయ బావిలో మొసలి ఉందని సోమవారం అటవీ అధికారులకు నర్సయ్య తెలిపాడు. ఈ మేరకు అటవీ అధికారులు సంతోష్, శ్వేత, సిబ్బంది, స్థానికుల సాయంతో మొసలిని పట్టుకున్నారు. అనంతరం అటవీ అధికారులు, కౌన్సిలర్ శ్రీకాంత్, వనిల్, భాస్కర్‌రెడ్డి, సురేశ్, గంగన్న మొసలిని డ్యాంలో వదిలారు.

కుస్తీ పోటీలు



తలపడుతున్న మల్లయోధులు

ముధోల్: హనుమాన్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని జటశంకర ఆలయం ప్రాంగణంలో గ్రామకమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంతోపాటు మహారాష్ట్రలోని నాందెడ్, భోకర్, ధర్మాబాద్ నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. నాందెడ్‌జిల్లాకు చెందిన మల్లయోధుడు ప్రథమ స్థానంలో నిలువగా రూ.10వేలు అందించారు. ద్వితీయ బహుమతిగా రూ.5వేలు అందజేశారు.

సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలం బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోగల కుమురంభీంగూడ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని గురువారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ), జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ పిలుపునిచ్చారు. సభకు ప్రొఫెసర్ కోదండరాం ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం కుమురంభీంగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమురంభీంగూడ వాసుల సమస్యలు పరిష్కరించాలని వివిధ తరహాల్లో ఉద్యమించినా ఫలితం లేకపోయిందని వాపోయారు. టీపీజేఏసీ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, వివిధ సంఘాల నాయకులు సుదర్శన్, అజయ్, వాజీత్‌ఖాన్, మనోజ్, లలితాబాయి, అనసూయ, ముకుంద్, భుజంగ్‌రావ్, భరత్, భీంరావ్ తదితరులున్నారు.

నగదు పట్టివేత

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.లక్ష నగదు పట్టుబడినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి క్యాస సంతోష్‌రెడ్డితో పాటు సిబ్బంది దేవ్, ముజీబ్, ముఖీద్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. నిర్మల్ నుంచి మెట్‌పల్లి వెళ్తున్న వీ తిరుపతి ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న రూ.లక్ష నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థుల పూజలు



పూజలు చేస్తున్న గోడం నగేశ్, పాయల్ శంకర్



మొక్కుతున్న ఆత్రం సక్కు, జోగు రామన్న

జైనథ్: బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మండలంలోని పెండల్‌వాడ గ్రామంలోని ఆత్మలింగ హనుమాన్ ఆలయంలో మంగళవారం వేర్వేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేక పూజలు చేశారు. ఆయా పార్టీల కార్యకర్తలు, నాయకులతో కాసేపు మాట్లాడారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ వెంట ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు వెంట మాజీ మంత్రి జోగు రామన్న ఇతర నాయకులున్నారు.

ఘనంగా హనుమాన్ జయంత్యుత్సవాలు



ఉత్సవాల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రం, లక్కారం, కేబీ నగర్ కాలనీల్లో మంగళవారం హనుమాన్ జయంత్యుత్సవాలను ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతోపాటు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జెండా ఊపి శోభాయాత్ర ప్రారంభించారు. శోభాయాత్ర పట్టణ ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, సమితి సభ్యులు కొండేరి రమేశ్, సాడిగే రాజ్‌గోపాల్, యువనాయకులు జయచంద్ర, రాజేశ్వర్, రాజేశ్వర్, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం రైతులు ఆందోళన చెందొద్దు



రైతులతో జిల్లా ఉద్యానశాఖ అధికారి సుధాకర్

తాంసి: ఎండల తీవ్రతకు బోరుబావులు అడుగంటగా కొద్దిపాటి నీటిని అందించి ఆయిల్‌పాం మొక్కలు కాపాడుకోవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్.సుధాకర్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని హస్నాపూర్ గ్రామంలోని ఆయిల్‌పాం క్షేత్రంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం సాగునీరు అందక ఆయిల్‌పాం మొక్కలు తొలగించిన రైతు నవనీత్‌రెడ్డితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఆయిల్‌పాం పంటను రక్షించుకోవడానికి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాగునీటి ఎద్దడి ఉన్నా రైతులు కొద్దిపాటి నీటిని అందిస్తే మొక్కలు ఏపుగా పెరిగే అవకాశముందని చెప్పారు. సాగునీరు అందకున్నా మొక్కలు బతికే అవకాశం ఉంటుందని, పూత, కాత కూడా వస్తుందని తెలిపారు. ఇంకా ఎలాంటి సందేహాలున్నా అధికారులను సంప్రదించి సలహాలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట కంపెనీ ఏరియా మేనేజర్ టీ కళ్యాణ్‌రెడ్డి, క్లస్టర్ ఆఫీసర్ రమేశ్, రైతులు స్వామిరెడ్డి, లక్ష్మారెడ్డి, మధుకర్‌రెడ్డి, నవనీత్ తదితరులున్నారు.

కాంగ్రెస్ ప్రచార రథాలు ప్రారంభం



ప్రచార రథానికి పూజ చేస్తున్న అభ్యర్థి సుగుణ

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలం దుర్గానగర్‌లోని దుర్గామాతా ఆలయంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ పార్టీ ఎన్నికల ప్రచార వాహనాలకు మంగళవారం పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం దుర్గానగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ మొదటిసారి మహిళకు ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రజలు తనను ఆదరించి గెలిపించాలని కోరారు. పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు నగేశ్, లింగన్న, దుర్గ నాని, గోవింద్, దేవిదాస్, శాంతన్‌రావ్, ప్రవీణ్‌రెడ్డి, గంగారెడ్డి, నాగరాజు, వెంకటేశ్, రంజిత్, అడెల్లు, శ్రీలేఖ, లత, ఆశమ్మ తదితరులున్నారు.

ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థుల తగాదా!

- ఒకరికి తీవ్ర గాయాలు



హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న రాంచరణ్

భైంసాటౌన్: మండలంలోని ఖత్‌గాం శివారులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన గొడవలో రాంచరణ్ అనే విద్యార్థి తీవ్రంగా గాయపడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధిత విద్యార్థి తండ్రి వీరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం మండలం పంచగుడికి చెందిన వీరేశ్ కుమారుడు రాంచరణ్ ఖత్‌గాం శివారులోని ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. గతనెల 6న ఉదయం బాత్రూంలో స్నానం చేసే విషయమై తొమ్మిదో తరగతి విద్యార్థితో గొడవ తలెత్తింది. ఈ ఘటనలో తన కుమారుడు రాంచరణ్ కంటికి తీవ్ర గాయమైనట్లు వీరేశ్ ఆరోపించాడు. ఈ విషయం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో తన కుమారుడు ఫోన్ చేసి చెప్పగా వెంటనే పాఠశాలకు చేరుకున్నానని తెలిపాడు. కాగా, అప్పటికే పాఠశాల యాజమాన్యం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యుడికి చూపించినట్లు పేర్కొన్నాడు. తర్వాత తన కుమారుడిని ఇంటికి తీసుకెళ్లగా తర్వాతి రోజు కంటి వద్ద గాయం వాచిపోగా వెంటనే ముథోల్‌లోని కంటి ఆస్పత్రిలో చూపించానని తెలిపాడు. వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించడంతో హైదరాబాద్‌లోని కంటి ఆస్పత్రిలో చేర్పించినట్లు పేర్కొన్నాడు. తన కుమారుడిపై దాడి జరిగిన విషయమై పోలీసులకు గతనెల 23న ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఈనెల 15న వార్షిక పరీక్ష ఉండడంతో రాయించేందుకు తన కుమారుడిని పాఠశాలకు తీసుకురాగా, యాజమాన్యం అనుమతించలేదని ఆరోపించాడు. తన కుమారుడు తీవ్రంగా గాయపడి కన్ను కోల్పోయే పరిస్థితి వచ్చినా పాఠశాల యాజమాన్యం పట్టించుకోవడం లేదని, పైగా పరీక్షకు అనుమతించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని వాపోయాడు. సదరు పాఠశాల యాజమాన్యంపై చర్య తీసుకోవాలని కోరాడు. కాగా, ఈ విషయమై పాఠశాల యాజమాన్యాన్ని 'సాక్షి' ఫోన్‌లో వివరణ కోరగా, విద్యార్థికి గాయమైన మాట వాస్తవమేనని, అతడు పరీక్ష రాసేందుకు నిరాకరించలేదని పేర్కొన్నారు.

హోటల్‌లో ఆకస్మిక తనిఖీ



యజమానికి జరిమానా రశీదు ఇస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని బిగ్ బావర్చి హోటల్‌లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఆహార భద్రత డిజిగ్నేటెడ్ అధికారి ఎం.శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఓ వినియోగదారుడు హోటల్‌లో బిర్యాని తింటుండగా అందులో బొద్దింక వచ్చింది. దీనిపై హోటల్ నిర్వాహకులను ప్రశ్నించగా దురుసుగా వ్యవహరించినట్లు బాధితుడు తెలిపాడు. దీనిపై పత్రికల్లో కథనాలు రాగా స్పందించిన అధికారులు తనిఖీలు చేపట్టారు. హోటల్‌లోని వంట గది, తాగునీరు, డైనింగ్ హాల్‌లను పరిశీలించారు. కార్మికులు, హోటల్ లైసెన్స్‌లపై ఆరా తీశారు. వంట షెడ్‌లో అపరిశుభ్ర వాతావరణం ఉండగా రూ.25వేల జరిమానా విధించారు. అనుమానాస్పదంగా కనిపించిన చికెన్ బిర్యాని, కోడిగుడ్లు, చికెన్ లాలిపప్ వంటి పంట పదార్థాల శాంపిళ్లు సేకరించారు. వాటిని హైదరాబాద్‌లోని నాచారం ఆహార భద్రత ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. అందులో ఏమైన లోటుపాట్లు ఉన్నట్లు తేలితే తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పట్టణంలోని ఆహార పదార్థాలు విక్రయించే వారంతా తప్పనిసరిగా అనుమతులు కలిగి ఉండాలని, తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. వారి వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, సిబ్బంది శ్రీనివాస్, ఖలీల్, అజర్ తదితరులున్నారు.

జై బోలో హనుమాన్


ఆదిలాబాద్‌టౌన్: పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే


పొన్నారి ఆలయంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూజలు


బేల: దీక్షను విరమింపజేస్తున్న పూజారి దినేశ్ చౌదరి


నేరడిగొండ: శోభాయాత్ర ప్రారంభిస్తూ..


గ్రామస్తులతో కలిసి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

హనుమాన్ జయంతిని జిల్లావ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జై హనుమాన్ నామస్మరణతో మార్మోగాయి. భక్తులు ప్రత్యేక పూజలు అనంతరం ఆలయాల కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే పాయల్‌శంకర్, నేరడిగొండ, తాంసి మండలం పొన్నారి, బోథ్ మండలంలోని సాకేర గ్రామంలోని ఆలయాల్లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూజలు నిర్వహించారు. పలుచోట్ల ఆలయాల్లో భక్తుల కోసం అన్నదానం చేపట్టారు. - ఆదిలాబాద్‌టౌన్/నేరడిగొండ/బేల/తాంసి/ఇంద్రవెల్లి/సిరికొండ/తలమడుగు

- ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్, తిర్పెల్లి, భాగ్యనగర్, వడ్డెర కాలనీ, ఇంద్రానగర్ హనుమాన్ ఆలయాల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని, హనుమంతుడి చల్లని దీవెనలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. పార్లమెంట్ ఎన్నికల కోఇన్‌చార్జి అశోక్ ముస్తాపురే, ముకుందరావు, విశాల్, సతీష్, రాము, సురేష్, దశరథ్, రాము, రఘుపతి, శివ తదితరులు ఉన్నారు.
- నేరడిగొండలోని పెద్ద హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూజలు చేశారు. అనంతరం హనుమాన్ శోభాయాత్రను ప్రారంభించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత వైపు పయనించాలన్నారు. ఎంపీపీ రాథోడ్ సజన్, తాజా మాజీ సర్పంచ్ పెంట వెంకటరమణ, వీడీసీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, విశ్వ హిందూ పరిషత్, బజారంగ్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.
- బేల, ఇంద్రవెల్లి, తాంసి, భీంపూర్, సిరికొండ, తలమడుగు మండలాల్లోని ఆలయాల్లో భక్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పూజలు నిర్వహించారు.


తలమడుగు: రుయ్యాడి గ్రామంలో..


తలమడుగు: కోసాయి హనుమాన్ ఆలయంలో..


తాంసి శివారులోని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఇంద్రవెల్లి: అన్నదానం చేస్తూ..

క్లుప్తంగా

గ్రంథాలయానికి విరాళం


పుస్తకాలు అందజేస్తున్న న్యాయవాది

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామంలో గ్రామ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి ప్రముఖ న్యాయవాది టి.రోసిరెడ్డి మంగళవారం రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. తనవంతుగా గ్రంథాలయానికి రూ.2 వేల విలువ గల పుస్తకాలు అందించారు. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.ప్రవీణ్ డీఎస్సీకి సంబంధించిన పుస్తకాలు అందించారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మేకల మురళీధర్, ప్రధాన కార్యదర్శి ముజీజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయ్ కుమార్, లెక్చరర్ నారాయణరెడ్డి, న్యాయవాది మధుసూదన్ రావు, గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోళ్లు ప్రారంభం

నేరడిగొండ: బోథ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో జొన్న కొనుగోళ్లు ప్రారంభమైనట్లు నేరడిగొండ పీఏసీఎస్ సీఈఓ బారే నాగభూషణం తెలిపారు. నేరడిగొండ మండలంలోని గ్రామాల్లో రైతుల జొన్న పంటను క్లస్టర్ల వారీగా కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కుమారి క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులకు సంబంధించి ఈనెల 28 వరకు కొనుగోలు చేస్తారని తెలిపారు. వడూర్ క్లస్టర్ పరిధిలోని సంబంధించి ఈనెల 29 నుంచి మే 3 వరకు, వాంకిడి క్లస్టర్ పరిధిలో గల రైతుల పంటలను 4 నుంచి 8వ తేదీ వరకు, బుగ్గారం(బి) క్లస్టర్ పరిధిలో 9 నుంచి 11 వరకు, నేరడిగొండ క్లస్టర్ పరిధిలో 12 నుంచి 14 వరకు, తేజాపూర్ క్లస్టర్ పరిధిలో 15 నుంచి 18 వరకు, కొర్టికల్(బి) క్లస్టర్ పరిధిలో 19 నుంచి 21 వరకు కొనుగోళ్లు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా క్లస్టర్‌లోని రైతులు గమనించాలని కోరారు.

'బీజేపీ నేతలకు ఓటమి భయం'


మాట్లాడుతున్న పసుల చంటి

ఇచ్చోడ: బీజేపీ నేతలకు ఓటమి భయం పట్టుకుందని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి పేర్కొన్నారు. ఇచ్చోడలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ నేతలు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని తెలిపారు. సీఎంపై గోడం నగేష్ ఇష్టారీతిగా మాట్లాడడం సరికాదన్నారు. ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కొంరం కోటేశ్వర్, ఇచ్చోడ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమూద్ ఖాన్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మణ్, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ముస్తఫా, శంకర్ పటేల్, మధుకర్, ఆశన్న, తుకారం పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత


డబ్బులు పోగు చేస్తున్న విద్యార్థులు

నేరడిగొండ(బోథ్): బోథ్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు అనాథ పిల్లలకు చేయూతనందించారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాల ముగింపు సందర్భంగా సేవా కార్యక్రమాల్లో భాగంగా వారం రోజులుగా వారి పాకెట్ మనీ జమ చేశారు. ఆ డబ్బులతోపాటు అంతే మొత్తంలో పాఠశాల యాజమాన్యం కలిపి మంగళవారం హైదరాబాద్‌లోని ప్రగతి ఫౌండేషన్ అనాథశ్రమానికి పంపించారు. హెచ్‌ఎం కొండ రాజేంద్రగౌడ్ తదితరులు ఉన్నారు.

శిశుమందిర్‌లో హనుమాన్ జయంతి..
బోథ్‌లో శ్రీ సరస్వతి శిశుమందిర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో హనుమాన్ జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు హనుమాన్ చాలీసా పారాయణం పఠనం చేసి అంజనేయుడి చిత్రపటం వద్ద పూజలు చేశారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఇచ్చోడ: నీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మండల ప్రత్యేక అధికారి పుల్లయ్య అన్నారు. మండలంలోని దాబా(కే), దాబా(బి), తలమద్రి, కోసుగూడ గ్రామాల్లో మంగళవారం నీటి సరఫరాను పరిశీలించారు. మండలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఉన్నారు.

కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, హమాలీలు

ఎదులాపురం: కార్మిక దినోత్సవాన్ని సివిల్ సప్లయి కార్మికులు ఘనంగా జరుపుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో మంగళవారం సివిల్ సప్లయి హమాలీ యూనియన్ నాయకులతో కలిసి మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఏఐటీయూసీ నాయకులు సిర్ర దేవేందర్, హమాలీలు అఫ్రోజ్, సలీం, మోసిన్, కిశోర్, జమ్ము, అబ్బు, వసంత్, గోపాల్, అబ్దుల్, బండు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల సీట్లు సాధించడం అభినందనీయం


విద్యార్థులకు మహనీయుల చిత్రపటాలను అందిస్తున్న ఉపాధ్యాయులు

తలమడుగు: కజ్జర్ల పాఠశాల నుంచి 11 మంది విద్యార్థులు గురుకులాల్లో సీట్లు సాధించడం అభినందనీయమని ఎంఈవో నారాయణ అన్నారు. వీరిని మంగళవారం సన్మానించారు. అనంతరం హెచ్‌ఎం జ్యోతి, విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. హెచ్‌ఎం కృష్ణారావు, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు లలిత, రాజు, నగేశ్, చిన్నయ్య, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాలాల్ జగదాంబదేవి ఆలయాల్లో పూజలు


రాజురా జగదాంబ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన స్వగ్రామమైన రాజురాలో గల సేవలాల్, జగదాంబ దేవి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతి పురస్కరించుకొని పూజలు చేశారు. అక్కడి నుంచి బీఆర్ఎస్ ప్రచారాన్ని ప్రారంభించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. ఎంపీపీ రాథోడ్ సజన్, వైస్ ఎంపీపీ మహేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు డాక్టర్ జహీర్, పండరి, పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, జాదవ్ గణేష్, మదన్ సింగ్, సవైరాం, విశాల్ పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ప్రచార రథాలు







పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ గడువు సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ప్రజల్లోకి వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారం కోసం రథాలను సిద్ధం చేశారు. ఆలయాల్లో రథాలకు పూజలు నిర్వహించి ప్రచారానికి బయల్దేరారు. అధికార కాంగ్రెస్‌తో పాటు బీజేపీ, బీఆర్ఎస్ ప్రచార రథాలు సాగుతున్న దృశ్యాలివి. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

వినూత్న ప్రచారం



జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం నేతాజీ చౌక్‌లో జిలేబీ చేయడంతోపాటు టీ కొట్టులో చాయ్ తయారు చేసి ఓట్లను అభ్యర్థించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పోటీ పరీక్షల్లో రాణించాలి


అభ్యర్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: యువత పోటీ పరీక్షల్లో రాణించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో హైమన్ డార్ఫ్ గ్రంథాలయాన్ని మంగళవారం సందర్శించారు. గ్రంథాలయంలో ఏర్పాట్లపై అభ్యర్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని సబ్జెక్టుల వారీగా పుస్తకాలు అందుబాటులో తెస్తామన్నారు. చదివే వారికి ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. అలాగే కూలర్లు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు.

మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: వేసవిలో నర్సరీల్లో మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. మండలంలోని తేజాపూర్ గ్రామంలో నర్సరీని మంగళవారం సందర్శించారు. మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు.

గుర్తింపునిచ్చారు.. నిధులు మరిచారు

- జిల్లాలో 10 పీహెచ్‌సీలకు ఎన్‌క్వాస్
- మూడేళ్లుగా రాని నిధులు
- ఎంపికైన ఆసుపత్రుల్లో మెరుగుపడని సౌకర్యాలు


ఎన్‌క్వాస్ కింద ఎంపికైన గాదిగూడ పీహెచ్‌సీ

నార్నూర్: స్వచ్ఛత, మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా పనిచేసే ప్రభుత్వ ఆస్పత్రులకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నేషనల్ హెల్త్ సిస్టం రీసోర్స్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ) వారు సంయుక్తంగా ఎన్‌క్యాస్ (నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్స్) గుర్తింపును అందజేస్తున్నారు. ఇలా ఎంపిక చేసిన వాటికి జాతీయ స్థాయి గుర్తింపుతోపాటు ప్రత్యేకంగా ఏడాదికి రూ.3 లక్షల చొప్పున మూడేళ్లపాటు నిధులు అందించాల్సి ఉంది. వీటితో అత్యవసర మందులు అందుబాటులో ఉంచడంతోపాటు రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. అలాగే 25 శాతం నిధులను ఎన్‌క్యాస్ గుర్తింపులో సహకరించిన వైద్య సిబ్బంది అందించాల్సి ఉంటుంది. అయితే ఎంపికతో సరిపెట్టిన ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలు తీరడం లేదు. ప్రజల బాధలు తొలగడం లేదు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల గిరిజనుల అవస్థలు వర్ణణాతీతం.

ఇదీ పరిస్థితి..
కేంద్రప్రభుత్వం ఆరేళ్లుగా ఎన్‌క్యాస్ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో మొత్తం 9 పీహెచ్‌సీలు 2019లో ఎంపికయ్యాయి. గాదిగూడ, భీంపూర్(టి), దంతనపల్లి, ఇంద్రవెల్లి, అంకోలి, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. పీహెచ్‌సీలకు మూడేళ్ల నుంచి నిధులు విడుదల కాలేదు. కరోనా వ్యాప్తి అధికారులు పట్టించుకోకపోవడంతో మరలా ఎంపిక జరగలేదు. దాదాపు మూడేళ్లుగా ఎంపికైన నిధులు రాకపోవడంతో ఆసుపత్రుల్లో ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి. వైద్యం కోసం ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ సరిపడా వసతులు లేక ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యాలు లేక సరైన సమయంలో వైద్య అందక మృత్యువాత పడుతున్న సంఘటనలు అనేకం. వైద్యారోగ్యశాఖ అధికారులు వెంటనే నిధులు మంజూరుకు కృషిచేయాలని పలువురు గిరిజనులు కోరుతున్నారు.

నిధులు వస్తేనే..
జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పీహెచ్‌సీలకు ఎన్‌క్వాస్ గుర్తింపు లభించింది. అయితే వీటికి ఏటా అందాల్సిన నిధులు అందని మాట వాస్తవమే. నిధులు వస్తేనే సమస్యలు పరిష్కారమవుతుంది. త్వరలోనే వస్తాయని భావిస్తున్నాం. ఏజెన్సీ పీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందించడానికి కృషిచేస్తాం.
– మనోహర్, జిల్లా అదనపు వైద్యాధికారి

సంక్షిప్తంగా

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
నేరడిగొండ: మోదీని మరోసారి ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో గల హనుమాన్ ఆలయం వద్ద ప్రచార వాహనానికి మంగళవారం పూజలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేశ్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బీజేపీ నేతలు శంకర్, గంగాధర్, శ్రీను, రాజు, రితీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'నగేశ్‌పై విమర్శలు సరికాదు'
ఇంద్రవెల్లి: బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌పై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు విమర్శలు చేయడం సరికాదని మాజీ ఎంపీపీ కనక తుకారాం అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గోడం నగేశ్‌పై ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ తుకారం, బీజేపీ మండల అధ్యక్షుడు రాజలింగం, ఎంపీటీసీ పద్వాల్ విజయ్‌సింగ్, మరప రాజు, భీంరావు, హన్మంతు తదితరులు ఉన్నారు.

ప్రజాసేవలో ముందుండాలి
ఆదిలాబాద్‌టౌన్: ప్రజాసేవలో ప్రతిఒక్కరూ ముందుండాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ అధ్యక్షుడు జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని తిర్పెల్లిలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వికలాంగులకు వీల్ చైర్లు, మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. యువజన సంఘాల సమితి అధ్యక్షుడు బాలశంకర్ కృష్ణ, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, లోక ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత సేవలో ముందుండాలి
తలమడుగు: యువకులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని తాంసి మండల బీసీ యువజన విభాగం అధ్యక్షుడు ధారవేణి రాఘవేంద్ర అన్నారు. తన తండ్రి నరసయ్య జ్ఞాపకార్థం తలమడుగు మండలంలోని సాయిలింగి వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. రమేశ్, అమరేందర్, రాజశేఖర్, పెంటన్న రమణయ్య, సాయికృష్ణ ఉన్నారు.

గడప గడపకూ బీజేపీ
సిరికొండ: మండలంలోని నేరడిగొండ (జి), నారాయణపూర్, జెండాగూడ గ్రామాల్లో గడప గడపకూ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కేంద్ర పథకాలను వివరించారు. అనంతరం పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షులు బోయిన్‌వాడ్ అమోల్, మాణిక్‌రావు, కిసాన్, బాలాజీ, జగన్, కృష్ణ, గోవింద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలి
ఆదిలాబాద్‌రూరల్: ఎండ తీవ్రత ఉన్నందున వడదెబ్బకు గురికాకుండా ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలని మహిళా సాధికారత కేంద్రం నిర్వాహకురాలు యశోద అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకోలి, లోకారి గ్రామాల్లో సఖీ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. సఖీ కేంద్రం కేస్ వర్కర్ నాగమణితో కలిసి ఆమె మాట్లాడారు. కేంద్రం అందించే కౌన్సెలింగ్, న్యాయ, పోలీసు, వైద్య సేవలతో పాటు తాత్కాలిక వసతి గురించి వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఎల్లన్న, ఇస్రు పాల్గొన్నారు.

గడప గడపకూ మన కాంగ్రెస్
నేరడిగొండ: ధన్నూర్(బి) గ్రామంలో గడప గడపకు మన కాంగ్రెస్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ధన్నూర్(కె), బోథ్ వారసంత, నారాయణపూర్, అందూర్, రఘునాథ్‌పూర్, మందబొగుడ, బీర్లగొంది గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు కోవ దౌలత్‌రావు మోకాసి, అడెల్లు, ఇందిరారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రమణ రెడ్డి, ఇంద్ర రెడ్డి, మండలాల కన్వీనర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మహంకాళీ ఆలయంలో పూజలు


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

సిరికొండ: వాయిపేట్ గ్రామంలోని మహంకాళీ అమ్మవారి ఆలయం వార్షికోత్సవానికి మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరయ్యారు. అనంతరం మహంకాళీ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఆర్థికసాయం

ఇంద్రవెల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద అయిన బాలాజీ తన చెల్లె పెళ్లి కోసం ఇంద్రవెల్లి గ్రామ పటేల్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి పటేల్ డోంగ్రే మంగళవారం రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. మండల కేంద్రంలోని వనవాసీ కళ్యాణ పరిషత్ ఆవరణలో నగదును అందజేశారు.